సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

జాతీయ స్థాయి దివ్యాంగుల టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. కెప్టెన్, 13 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించనున్నారు. 8లో ▸



టీడీపీ చేసింది శూన్యం

భీమవరంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేకపోవడంతోనే యువగళం బృందం దౌర్జన్యకాండ సృష్టించినట్టు చర్చ జరుగుతోంది. 8లో ▸

ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా కీర్తి



భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.కీర్తిని నియమించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నోడల్ అధికారిగా పనిచేస్తున్న కీర్తిని ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి నియమించారు.

న్యూస్‌రీల్

త్వరలో అందుబాటులోకి బ్లడ్ బ్యాంక్



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును వీలైనంత త్వరగా అందుబాటులోనికి తీసుకురావాలని కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు పి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని రాయలంలో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాస్ రక్త కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. బ్లడ్ బ్యాంక్ లైసెన్స్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. రెడ్‌క్రాస్ నేషనల్ హెడ్‌క్వా ద్వారా రూ.1.20 కోట్ల విలువైన పరికరాలను సమకూరుస్తున్నారన్నారు. ఇప్పటికే పలువురు సభ్యత్వం, దాతల సహకారంతో మౌలిక వసతులు కల్పించామన్నారు. సౌకర్యాలు, పరికరాల గురించి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎంఎస్‌వీఎస్ భద్రిరాజును కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి కేబీటీ రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.రామరాజు, బ్లడ్ బ్యాంక్ అడ్వైజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమాన్ని వైద్యారోగ్య శాఖ సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయించుకోని చిన్నారులు, గర్భిణులను గుర్తించి టీకాలు వేయించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. రెండో విడతగా నేటి నుంచి ఈనెల 16 వరకు, మూడో విడతగా వచ్చేనెల 9 నుంచి 14 వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేస్తామన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి 2023కి మీజిల్స్, రుబెల్లా లేని జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర డి.మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ బి.సుజాతారాణి, డీఐఓ డాక్టర్ దేవ సుధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారికి కాసుల పంట

26 రోజులకు రూ.2.52 కోట్ల ఆదాయం



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గత 26 రోజులకు గాను నగదు రూపేణా రూ.2,52,31,596 ఆదాయం లభించినట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా 337 గ్రాముల బంగారం, 7.632 కిలోల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.11 వేలు లభించాయన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా అందించే అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండీహెచ్ మెహరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడానికి గాను పర్యాటక రంగంతో పాటు ట్రావెల్ టూరిజంలో సైతం ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రతిభ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఏపీ టూరిజం వెబ్‌సైట్‌లో సంబంధిత దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారానే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దరఖాస్తు అప్‌లోడ్ చేసుకోవడానికి ఈనెల 19 వరకూ గడువు ఉందని, అవార్డుకు ఎంపికైన వారికి ఈనెల 27న జరిగే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో అవార్డులను అందజేస్తారని పేర్కొన్నారు.

నైపుణ్య ప్రాప్తిరస్తు

శిక్షణ.. ఉపాధి కల్పన

- ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చర్యలు
- జిల్లాలో 29,525 మందికి శిక్షణ
- జాబ్‌మేళాల ద్వారా 2,186 మందికి ఉద్యోగాలు
- జిల్లాలో 7 స్కిల్ హబ్‌లు, ఒక స్కిల్ కళాశాల



స్కిల్‌ఫుల్‌గా.. పెదమైనవానిలంక స్కిల్ కళాశాలలో ఎలక్ట్రికల్ శిక్షణలో యువత

భీమవరం(ప్రకాశం చౌక్): యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైపుణ్య శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వృత్తి నిపుణులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉద్యోగాలు కల్పించేలా మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. నైపుణ్య శిక్షణ పొందిన నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడంతో పాటు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలు పొందుతున్నారు.

29,525 మందికి..

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 2019 నుంచి ఇప్పటివరకు 29,525 మందికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వివిధ వృత్తి, కోర్సులు, కమ్యూనికేషన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు.

2,186 మందికి ఉద్యోగాలు

నాలుగేళ్లలో జిల్లాలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం 2,186 మందికి ఉద్యోగాలు కల్పించింది. ప్రతి నెలా ప్రతి నియోజకవర్గంలో కళాశాల లేదా ప్రైవేట్ ప్రదేశాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తూ ఉద్యోగాలు కల్పిస్తోంది.

ప్రముఖ పరిశ్రమల్లో..

జాబ్‌మేళాల్లో ప్రముఖ పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, ఫార్మా, ఆక్వా, సర్వీస్, బీమా, మార్కెటింగ్ ఇలా పలు రంగాలకు చెందిన సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

స్కిల్ కళాశాల : నరసాపురం మండలం పెదమైనవానిలంక

స్కిల్‌హబ్‌లు : భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఉండి మండలం దుంపగడప ప్రభుత్వ కళశాల, నరసాపురం లేసు పార్క్, పాలకొల్లు ప్రభుత్వ మహిళా కళాశాల, ఆచంట ప్రభుత్వ ఐటీఐ కళాశాల, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి కళాశాల.



ఆచంటలో శిక్షణ పొందుతున్న మహిళలు

డిగ్రీ విద్యార్థులకు కోర్సులు

కంప్యూటర్ కోర్సులు ట్యాలీ విత్ జీఎస్‌టీ, ఎంఎస్ ఆఫీస్, పైథాన్, డిజిటల్ మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ కోర్సులు, కమ్యూనికేషన్స్ స్కిల్స్

వృత్తి సంబంధిత కోర్సులు

ఎలక్ట్రికల్ వర్క్, ప్లంబర్, ఆక్వాకల్చర్ టెక్నీషియన్, బ్యూటీషన్, టైలరింగ్ తదితర కోర్సులు

నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

సంవత్సరం	2019-20	2020-21	2021-22	2022-23
శిక్షణ పొందిన వారు	6,241	6,882	9,182	7,219

జాబ్‌మేళాల్లో ఉద్యోగాల కల్పన

సంవత్సరం	2019-20	2020-21	2021-22	2022-23
ఉద్యోగాలు	212	389	693	892

శిక్షణ ఇలా..

నరసాపురం మండలం పెదమైనవానిలంకలో స్కిల్ కళాశాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ బ్యాచ్‌కు 60 మంది చొప్పున ఆక్వాకల్చర్, ఎలక్ట్రికల్ వర్క్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 120 మంది ఇక్కడ శిక్షణ పొంది పలు పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందారు.

పీఎంకేవీవై పథకంలో..

ఈ ఏడాది ప్రధానమంత్రి కౌశల్య వికాస్ యోజన్ (పీఎంకేవీవై) పథకం ద్వారా జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేసి 335 మంది పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటిని గ్రామీణ యువత సద్వినియోగం చేసుకుంటోంది.

తరచూ జాబ్‌మేళాలు



“ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా డిగ్రీ విద్యార్థులకు పలు కోర్సుల్లో, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పొందిన వారికి జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి పొందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రముఖ కంపెనీలను జాబ్‌మేళాలకు తీసుకువచ్చి మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు యువతకు అందిస్తున్నాం.

– ఎ.కృష్ణారెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్, భీమవరం

ఉద్యోగం రావడం ఆనందం



నేను నరసాపురం పీఎం లంక స్కిల్ కళాశాలలో ఐదు నెలల పాటు ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ వర్క్ కోర్సులో శిక్షణ పొందాను. స్కిల్ కళాశాల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో నెల్లూరు సీఈటెక్ సోలార్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. నాకు నెలకు రూ.20 వేలు జీతం వస్తుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, పశ్చిమగోదావరి స్కిల్ డెవలమెంట్ ప్రోగ్రామ్ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నా.

– శివగణేష్, అయినవల్లి

బ్యాంకు మిత్రగా కొలువు



మాది వ్యవసాయ కుటుంబం. నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో రూరల్ బ్యాంకుమిత్రగా ఉద్యోగం పొందాను. నెలకు రూ.17,259 జీతం తీసుకుంటున్నా. ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహించడం ద్వారా నాకు ఉద్యోగం వచ్చింది. ప్రభుత్వం నిరుద్యోగులకు వృత్తి శిక్షణ ఇవ్వడంతో పాటు జాబ్‌మేళాలు నిర్వహించడం బాగుంది.

– ఎన్.శ్రీను, మల్లవరం

స్పందనలో 70 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం(ప్రకాశంచౌక్): స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు సమర్పించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో 70 అర్జీలను స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

- ఉండి మండలం వాండ్రం గ్రామానికి చెందిన బండారు వినాయక తనకు కాళ్ల మండలం పెదఅమిరంలో 1.42 ఎకరాల భూమి ఉందని అడంగల్‌ను సరిచేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు.
- వింతతు పెన్షన్ మంజూరు చేయాలని భీమవరం పట్టణానికి చెందిన యడ్ల లక్ష్మి కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేకం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

17న విశ్వకర్మ యోజన

ఏలూరు(మెట్రో): చేతివృత్తులు, సంప్రదాయ కళలతో జీవనం సాగిస్తున్న విశ్వకర్మలకు ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పథకం కింద 18 సంప్రదాయక చేతివృత్తులను పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొ న్నారు. పథకంలో భాగంగా చేతి వృత్తుదారులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఆధునిక పనిముట్లను సరఫరా చేస్తారని, రుణ సదుపాయం, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో అర్హులైన అభ్యర్థులు ఈనెల 17న ప్రారంభమయ్యే పథకానికి విశ్వకర్మ యోజన పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను జిల్లాస్థాయిలో పరిశీలించి రాష్ట్రస్థాయికి పంపుతామని, అక్కడి నుంచి జాతీయస్థాయికి పంపిస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన వారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారని, వారికి 15 రోజుల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500, రూ.15 వేల విలువైన పనిముట్లు, 18 నెలల్లో తిరిగి చెల్లింపు పద్ధతిపై ఎటువంటి గ్యారంటీ పెట్టకుండా రూ.లక్ష రుణం అందిస్తారన్నారని తెలిపారు. రెండో విడతలో 30 నెలల్లో తిరిగి చెల్లింపు పద్ధతిపై రూ.2 లక్షల రుణం మంజూరు చేస్తారని, ఏడాదికి 5 శాతం వడ్డీ ఉంటుందని తెలిపారు. 18 ఏళ్ల నిండి కుటుంబ వృత్తిగా ఉన్న సంప్రదాయ వృత్తి దారులు అర్హులని, వివరాలకు ఏలూరులోని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌ను, 96409 09821 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు

ఏలూరు(మెట్రో): జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేయడంలో భాగంగా ప్రతి పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వినియోగదారుల క్లబ్‌లు, వినియోగదారులను చైతన్యపరిచే 9 రకాల పోస్టర్లను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వారి హక్కులు, పరిష్కార విధానాల గురించి అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన వినియోగదారులుగా వ్యవహరించేలా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలోని 224 వినియోగదారుల క్లబ్‌ల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బంద్ విఫలం



భీమవరంలో తెరిచి ఉన్న షాపులు

సాక్షి, భీమవరం: చంద్రబాబు అరెస్టుకు నిరసన తెలుపుతూ తెలుగుదేశం పార్టీ ఇచ్చిన బంద్ జిల్లాలో విఫలమైంది. టీడీపీ పిలుపునకు జిల్లావ్యాప్తంగా స్పందన కరువైంది. జనసేన పార్టీ మద్దతు ఇవ్వడం, ప్రైవేట్ విద్యాసంస్థలు మూసివేయడం మినహా ఎక్కడా బంద్ ప్రభావం కానరాలేదు. భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోల నుంచి బస్‌లు ఉదయం నుంచి యథావిధిగా తిరిగాయి. వేకువజాము నుంచి భారీ వర్షం కురవడంతో వ్యాపార సంస్థలు కొంచెం ఆలస్యంగా తెరుచుకోగా ప్రభుత్వ కార్యాలయాలు రోజువారీ మాదిరిగానే పనిచేశాయి. టీడీపీ శ్రేణులు కూడా బంద్‌పై ఏ మాత్రం ఉత్సాహం చూపలేదు. టీడీపీ శ్రేణులు కొన్నిచోట్ల మొక్కుబడిగా రిలే నిరాహారదీక్షలు చేపట్టినా మధ్యాహ్నానికి విరమించడం విశేషం. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల్లో సైతం బంద్ ప్రభావం పెద్దగా కన్పించలేదు. చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు తరలించడాన్ని ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష అమలు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వైద్యారోగ్య శాఖ, గృహనిర్మాణం, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, టిడ్కో ఇళ్ల తదితర 12 అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనుందని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 15 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలన్నారు. ఈనెల 30న సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తారన్నారు. అదే రోజు నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించి ప్రత్యేక వైద్యులు, పీహెచ్‌సీ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. నెల రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాలకు మౌలిక వసతులను కల్పించి గృహప్రవేశాలు నాటికి పనులు పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా సోప్ పిట్స్ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రీ సర్వేలో భాగంగా మొదటి, రెండో దశ సకాలంలో పూర్తి చేయగలిగామని, మూడో దశలో 20 మండలాలు సుమారు 90 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉండిలో 'జగనన్నకు చెబుదాం'

ఉండి: ఉండి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏవీ అప్పారావు తెలిపారు. మండలంలో 19 గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేయవచ్చన్నారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లకు, విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించామని తెలిపారు.

13న మెగా జాబ్‌మేళా

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఈనెల 13న భీమవరం డీఎన్‌ఆర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 1,270 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఆక్సిస్ బ్యాంకు, అరబిందో ఫార్మా, అపెక్స్ సొల్యూషన్స్, యంగ్ ఇండియా మార్కెటింగ్, శ్రీరామ్ ఇన్సూరెన్స్, ఎల్‌ఐసీ, ఇన్నోవ్ సోర్స్ వంటి 21 కంపెనీల్లో టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్, జీఐఎస్ ఇంజనీర్, సర్వీస్ ఇంజనీర్, కస్టమర్ రిలేషన్ కో-ఆర్డినేటర్, ఇన్సైడ్ కార్పొరేట్ సేల్స్, క్వాలిటీ కంట్రోల్, మిషన్ ఆపరేటర్, టెలికాలర్స్, లోన్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలకు నియామకాలు ఉంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-35 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు నాగేంద్ర 8919684670, ప్రసన్న 7013896277, 9988853335 (టోల్ ఫ్రీ)ను లేదా ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. డీఎన్నార్ డిగ్రీ కళాశాల వైస్ ప్రెసిడెంట్ జి.పాండురంగ రాజు, ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI

SAKSHI DIGITAL MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్, నాచువారిసెంటర్, భీమవరం-1

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

ఫోన్ నంబరు : 9912440768

క్లుప్తంగా

యోగాసన పోటీల్లో ఉద్యాన విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని సుధారాణిని అభినందిస్తున్న వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం : కర్నూలులో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఉద్యాన కళాశాల వెంకట్రామన్నగూడెం విద్యార్థిని ఎ.సుధారాణి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. మహిళల 18–21 సంవత్సరాల కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారు. విద్యార్థినిని సోమవారం వర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ యోగాభ్యాసనం వల్ల శరీరం, మనసు అదుపులో ఉండటమే కాక, వ్యాధినిరోధక శక్తిని కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ఈ మేరకు వర్సిటీలో యోగాభ్యాసానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో బహుమతి గెల్చుకున్న సుధారాణి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఎస్.పద్మావతమ్మ, ఎస్టేట్ ఆఫీసర్ ఎంపీ మల్లికార్జునరావు, అసోసియేట్ డీన్ ఎం.మాధవి, అధ్యాపకురాలు, పీడీ వై.రాంబాబు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ రాష్ట్ర పోటీల్లో ఏలూరు బాలుడికి కాంస్యం



కాంస్య పతకం, సర్టిఫికెట్‌తో అచ్యుత్

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరు బాలుడు సత్తా చాటాడు. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎస్.అచ్యుత్ అండర్–11 విభాగంలో ప్రతిభ చూపి కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు. చిన్న వయసులో ప్రతిభ, నైపుణ్యం చాటిన అచ్యుత్‌ను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్, టీటీ కోచ్ ఘంటా శేఖర్ అభినందించారు.

భీమవరానికి టీడీపీ చేసింది శూన్యం

- యువగళం దౌర్జన్యంతో భీమవరం అభివృద్ధిపై సర్వత్రా చర్చ
- టీడీపీ హయాంలో చెప్పుకోదగ్గ ఒక్క పనీ చేపట్టని వైనం
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హయాంలో పేదలకు భారీగా ఇళ్ల నిర్మాణం
- 100 పడకల ఆసుపత్రికి ఎమ్మెల్యే 4 ఎకరాల భూమి విరాళం
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థలం అందజేత
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కోసం 120 ఎకరాల భూమి సేకరణ
- జిల్లా కేంద్రంగా భీమవరం ఏర్పాటు.. తాడేరు వంతెన నిర్మాణం



విస్సాకోడేరు జగనన్న లేఅవుట్‌లో పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లు



భీమవరం శివారు గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై నూతనంగా నిర్మించిన వంతెన

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో ఇటీవల యువగళం పాదయాత్ర పేరుతో టీడీపీ రౌడీమూకలు చేసిన దౌర్జన్యకాండ నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలలో బలంగా నాటుకుపోవడం.. టీడీపీ హయాంలో చెప్పుకోవడానికి ఒక్కటైనా అభివృద్ధి పనులు లేకపోవడం వల్లనే అరాచకాలు, కవ్వింపు చర్యలతో దాడులు చేసి ఎమ్మెల్యే శ్రీనివాస్‌పై వ్యతిరేకత సృష్టించాలని చేసిన టీడీపీ నేతల ప్రయత్నం బెడిసికొట్టింది. టీడీపీ చర్యల వల్ల పార్టీ ఇమేజ్ మాట అటుంచి గతంలో టీడీపీ చేసిన అభివృద్ధి ఏమిటనే చర్చకు తెరతీసింది. 2014లో టీడీపీ ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ అధికారంలో ఉన్నప్పటికీ పట్టణం, నియోజకవర్గంలో చెప్పుకోవడానికి ల్యాండ్‌మార్క్‌లాంటి ఒక్క అభివృద్ధి కూడా కనిపించడం లేదనే వాస్తవాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 2009లో భీమవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్రంధి శ్రీనివాస్ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు. దీనిలో భాగంగానే పట్టణ శివారు తాడేరు రోడ్డులో పేదల కోసం సుమారు 700 ఇళ్లు నిర్మించడమేగాక పట్టణ ప్రజల మంచినీటి అవసరాల కోసం 120 ఎకరాల భూమిని సేకరించి, 60 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయించి యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెన నిర్మించిన ఘనత ఎమ్మెల్యే శ్రీనివాస్‌కే దక్కింది. భీమవరం మండలంలోని గ్రామాల ప్రజలకు అనువుగా ఉండేందుకు యనమదుర్రు డ్రెయిన్‌పై నాలుగు వంతెనలు నిర్మించారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ఈ వంతెనకు అప్రోచ్ రోడ్లు సైతం నిర్మించలేకపోవడంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వంతెనలు నిరుపయోగంగా మారాయి. గ్రంధి శ్రీనివాస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాతనే అప్రోచ్‌రోడ్ల నిర్మాణంలో కదలిక వచ్చింది. పట్టణంలో సొంత భవనంలేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేరే ప్రాంతానికి తరలిపోతున్న తరుణంలో కోట్ల రూపాయల విలువ చేసే సొంత భూమిని ఉచితంగా ఇచ్చి కళాశాల సొంత భవనాల ఏర్పాటు చేయించారు.

2019 తరువాత మరింత అభివృద్ధి

2019 ఎన్నికల్లో సినీ ప్రముఖుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఘన విజయం సాధించిన శ్రీనివాస్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో మరింత అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లా కేంద్రం భీమవరం రావడానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ చేసిన కృషి పట్టణ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కోట్లు విలువ చేసే 4 ఎకరాల తన సొంత భూమిని ఉచితంగా ఇచ్చి ఆసుపత్రి నిర్మాణం చేపట్టించారు. విస్సాకోడేరు లేఅవుట్‌లో 3,600 మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి జగనన్న కాలనీ నిర్మాణంతో శ్రీనివాస్ క్రేజ్ మరింత పెరిగింది. తాడేరు రోడ్డులో గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన నిర్మాణానికి రూ.2.30 కోట్లు మంజూరు చేయించి వేగంగా నిర్మాణం పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే అండర్ పాస్‌ల నిర్మాణంలోనే తనదైన పాత్ర పోషించి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చూపించి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించడంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే సత్తా లేకనే టీడీపీ దౌర్జన్యాలు, దమనకాండ సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనే లక్ష్యంగా యువగళం పాదయాత్ర సాగినట్లు ప్రజలు సైతం చర్చించుకోవడం విశేషం. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని చెప్పుకోవడానికి లేకపోవడంతో పాటు ఎమ్మెల్యే శ్రీనివాస్ నిరంతరం ప్రజల పక్షాన నిలవడంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుపై నడకలా సాగిపోతుందని భావించే కుట్రలు, కుతంత్రాలతో యువగళం పాదయాత్రకు రూపకల్పన చేశారని భావన వ్యక్తమవుతోంది.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో మోసం

రూ.66 వేలు నష్టపోయిన యువకుడు

జంగారెడ్డిగూడెం: పార్ట్ టైమ్ జాబ్ పేరుతో ఆన్‌లైన్ మోసానికి గురై ఓ యువకుడు రూ.66 వేలు నష్టపోయాడు. యువకుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై వై.మంగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఎం.రమేష్ స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదాయం పెంచుకునే మార్గంలో అతను ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ కోసం ప్రయత్నించగా, 27625691767 అనే నంబర్ నుంచి మార్చి 21న రమేష్‌కు వాట్సాప్ ఫోన్ కాల్ వచ్చింది. అప్పటి నుంచి పార్ట్‌టైం ఆన్‌లైన్ వర్క్ ప్రారంభించాడు. చిన్న చిన్న మొత్తాలుగా చేసిన పనికి రమేష్ సొమ్ములు అందుకున్నాడు. సదరు ఆన్‌లైన్ వర్క్ ఇచ్చే వ్యక్తి పెద్ద మొత్తంలో ఆదాయం రావాలంటే ఇన్వెస్ట్ చేయొచ్చని రమేష్‌కు నమ్మబలికి దఫదఫాలుగా సొమ్మును అతని బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఇలా రమేష్ రూ.66 వేల వరకు సొమ్మును ఆన్‌లైన్ వ్యక్తి అకౌంట్‌లో జమ చేశాడు. అనంతరం రమేష్ వాట్సాప్ అకౌంట్‌ను బ్లాక్ చేయడంతో అనుమానం వచ్చి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ అధికారులు రమేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఆన్‌లైన్ వ్యక్తి వాట్సాప్, బ్యాంకు అకౌంట్‌ను హోల్డ్ చేసినట్లు సమాచారం ఇచ్చారు. వారు ఇచ్చిన సూచన మేరకు రమేష్ సోమవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చంద్రబాబు అరెస్టుతో ప్రజాస్వామ్యం పరిరక్షణ



ముదునూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంగరాజు, మాలమహానాడు కార్యకర్తలు

పెంటపాడు: ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పులు చేయడం అలవాటుగా మారిన చంద్రబాబుకు ఎదురు దాడి చేసే అర్హతను పూర్తిగా కోల్పోయారని, చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ అయిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో మాలమహానాడు అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేవలం స్కిల్ స్కాం కాకుండా అమరావతి భూకుంభకోణం, పోలవరం ప్రాజెక్టు అవకతవకల్లో చంద్రబాబుతో పాటు, ఆయన కుమారుడు లోకేష్, పార్టీ అధ్యక్షుడు అచ్చెంనాయుడు తదితరులను అధికారులు అరెస్టు చేయాలని అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. చంద్రబాబు 130 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, స్టేలు తెచ్చుకుని తాను నిప్పునంటూ ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు పాలనలో స్కామ్‌లు ఎక్కువగా జరిగాయన్నారు. దీనిపై టీడీపీ ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. చంద్రబాబును అరెస్టు చేస్తే రాష్ట్రంలో సరైన స్పందన కూడా లేకపోవడం గమనించాలన్నారు. సీఎంగా ఉండగా అన్నదమ్ములుగా కలిసి ఉండే మాల, మాదిగల మధ్య రాజకీయ స్వార్థం కోసం చిచ్చుపెట్టాడన్నారు. ఆపాపం ఊరికే పోదన్నారు. మందకృష్ణ మాదిగ చంద్రబాబుకు మద్దతు ఇవ్వడంపై మంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు అద్దంకి ఆనందరావు, ఉన్నమట్ల ఏసురత్నం, అద్దంకి అబ్రహాం, మరపట్ల ఏసేబు, సునీల్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాము

తణుకు: పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు కొలుసు రాము (38) తన బంధువుతో పాలు మోపెడ్‌పై ఉండ్రాజవరం జంక్షన్ వైపు వెళుతుండగా పాత వెంకట్రామయ్య థియేటర్ సమీపంలో అదుపుతప్పి ట్రాక్టర్ వెనుక చక్రాల కింద పడ్డారు. మోపెడ్ నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడగా, రాముకు తీవ్ర గాయాలు కాగా, అతనిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య కొలుసు సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై వి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసాపురంలో భారీ వర్షం

సాక్షి, భీమవరం: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. జిల్లాలోని నరసాపురంలో అత్యధికంగా 69.04 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, పాలకొల్లులో 38.2, మొగల్తూరులో 32.2, వీరవాసరంలో 28.6, భీమవరంలో 22.4, అత్తిలిలో 17.6, గణపవరంలో 15.4, ఆకివీడులో 12.6, ఉండిలో 18.2, పాలకోడేరులో 30.8, పెనుమంట్రలో 10.2, ఇరగవరంలో 9.8, పెనుగొండలో 16.4, ఆచంటలో 20.2, కాళ్లలో 20.2, యలమంచిలో 18.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

ఏలూరు (మెట్రో): ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్, విజయవాడ నోటిఫికేషన్ 23/2021 నంబర్ ద్వారా నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు కొరకు మెయిన్స్ పరీక్ష రాసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ఏలూరులోని కలెక్టర్ కార్యాలయానికి హాజరై సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలన్నారు. అర్హత పొందిన అభ్యర్థుల వివరాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈఎల్‌యూఆర్‌యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈ జాబితాలోని వివరాలను సరిచూసుకోవాలని కోరారు.

మహిళా వలంటీర్లను వేధిస్తున్న అజ్ఞాత వ్యక్తిపై కేసులు

ఏలూరు టౌన్: నగరంలో మహిళా వలంటీర్లను వేధిస్తున్న ఓ అజ్ఞాత వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలో పనిచేస్తున్న కొందరు మహిళా వలంటీర్లకు అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తాను వైద్యశాఖ అధికారి కుమార్ అంటూ పరిచయం చేసుకుని సర్వేలు ఎంతవరకూ చేశారంటూ వ్యక్తిగత వివరాలు, ఐడీ నంబర్, ఇతర వివరాలు సేకరించడమే కాక అర్ధరాత్రి వేళ మహిళా వలంటీర్లకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. అజ్ఞాత వ్యక్తి ఫోన్ నంబర్‌తో అధికారులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న మహిళా వలంటీర్లు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో అజ్ఞాత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మరో ఐదుగురు మహిళా వలంటీర్లు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల క్రికెట్ రాష్ట్ర జట్టు ఎంపిక



తణుకులో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రికెట్ జట్టును ప్రకటిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: జాతీయ స్థాయి దివ్యాంగుల టీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల జట్టు మంచి ప్రదర్శన ఇచ్చి టోర్నమెంట్ విజేతగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీసీఐ సపోర్టింగ్ బాడీ), సనాతన సేవా సంస్థాన్, ఉదయ్‌పూర్, రాజస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఉదయ్‌పూర్‌లో నిర్వహించే దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ జట్టును ఆంధ్ర క్రికెట్ ఫెడరేషన్ ఫర్ డిజబుల్డ్ గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి కారుమూరి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ 24 రాష్ట్రాల జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌కు ఆంధ్ర జట్టును గత నెల 25న మూలపాడు ఏసీఏ క్రికెట్ మైదానంలో ఎంపిక చేసినట్లు చెప్పారు. డీసీసీఐ సౌత్ జోన్ కో–ఆర్డినేటర్ మధుసూదన్ నాయక్ ఈ టోర్నమెంట్‌ను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జట్టు కెప్టెన్‌తోపాటు మరో 13 మంది సభ్యులు, కోచ్, మేనేజర్‌లను ఎంపిక చేసినట్లు వివరించారు.

జట్టు సభ్యులు వీరే

జి.కైలాష్‌రెడ్డి (కెప్టెన్), ఎస్‌కే నాగూర్ హుస్సేన్ (వైస్ కెప్టెన్), వి.రోషిరెడ్డి, ఎస్.హుదా, ఎం.కిషోర్ బాబు, వి.విజయకుమార్ (వికెట్ కీపర్), డి.అఖిల్‌రెడ్డి, ఎండీ ఖాలీష్, వి.అఖిల్‌వర్మ, ఎస్.సాయికృష్ణ, యు.లీలాకృష్ణ, పి.రాయుడు, ఎ.గణేష్, బి.యశోదకృష్ణ ఎంపికయ్యారు. అలాగే కోచ్‌గా నందం సాయి, జట్టు మేనేజర్‌గా పల్నాటి బలరామకృష్ణలను నియమించారు.

మామిడిలో సస్యరక్షణకు తరుణమిదే

- ఇప్పటినుంచే దుక్కులు దున్ని ఎరువులు వేసుకోవాలి
- తోటల పునరుద్ధరణ చర్యలపై రైతులకు అవగాహన



చింతలపూడిలో మామిడి తోట, ఎ.దుర్గేష్, అసిస్టెంట్ డైరెక్టర్, ఉద్యాన శాఖ (అంతరచిత్రం)

పాడి - పంట

చింతలపూడి: మామిడి తోటలు సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో పూతకు వస్తాయి. ఈ దశలో మామిడి రైతులు ఇప్పటినుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఒక పక్క మామిడి తోటల పునరుద్ధరణపై దృష్టి సారిస్తూనే మరో పక్క సస్యరక్షణపై ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం, ద్వారకాతిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి తోటల పునరుద్ధరణకు, అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టి రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్రతి ఏటా నాణ్యమైన పంట దిగుబడిని గణనీయంగా పెంచడానికి ఉద్యాన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్ తెలియజేస్తున్నారు. పూత రావడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు సూచిస్తున్నారు.

సెప్టెంబర్‌కు ముందే దుక్కులు

మామిడి రైతులు సెప్టెంబర్‌కు ముందే తోటల్లో దుక్కులు దున్నుకోవాలి. చెట్లకు కావలసిన ఎరువులను వేసుకోవాలి. అక్టోబర్ తరువాత మామిడి తోటలను దున్నకూడదు. ఈ దశలో దున్నితే చెట్ల వేర్లు కదిలి పోషక పదార్థాల సమతుల్యత దెబ్బతింటుంది. సాధారణంగా మామిడిలో పూత ఒకేసారి రాదు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పూత వస్తూనే ఉంటుంది. ఆ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం సరికాదు. ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలిక పాటి నీటి తడులు ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తోటల్లో సూక్ష్మ పోషకలోపాలను నివారించడానికి లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 3 గ్రాముల బోరాక్స్, 5 గ్రాముల ఫెర్రిక్ సల్ఫేట్, 10 గ్రాముల యూరియా కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం పడితే రసం పీల్చే పురుగులు చేరే అవకాశం ఉండటం కారణంగా తోటల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. తోటల్లో పూత, మొగ్గలు ప్రారంభమైన తరువాత మొగ్గలు విచ్చుకుని పూత రావడానికి 2 గ్రాముల బోరాన్ లేదా, 10 గ్రాముల మల్టీ–కేతో పాటు 5 గ్రాముల ఫార్ములా–4 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు నివారణ

తేనె మంచు పురుగులు తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులను, పూత కాండాలను, లేత పిందెల నుంచి రసం పీల్చి నష్టం చేస్తాయి. దీని వల్ల ఆకుల చివర్లు మాడిపోతాయి. పూత మాడిపోతుంది. పిందెలు బలహీన పడి రాలిపోతాయి. అంతే కాకుండా ఈ పురుగులు విసర్జించే పదార్థం వల్ల ఆకులు, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. పూత, పిందె దశలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లో ఈ పురుగులు చెట్టు మొదలు, కొమ్మల బెరడుల్లోని పగుళ్లలో ఉంటాయి.

నివారణ ఇలా..

వీటి నివారణకు 1.5 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత మొగ్గ దశలో లీటరు నీటికి 1 మి.లీటరు డైక్లోరోఫాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చ పూత దశలో, మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా డైమిథియేట్ లేదా 3 మి.లీటర్ల మిథైల్ డెమాటాన్ లేదా 0.25 మి.లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందు పిచికారీ చేయాలి.

బూడిద రంగు తెగులు నివారణ

మామిడి లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరు పిందెల మీద తెల్లటి పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీన్నే బూజు తెగులు అంటారు. రాత్రుళ్లు చల్లగా, పగలు వేడిగా ఉన్నప్పుడు ఇది ఆశిస్తుంది. దీని వల్ల పూత రాలి పోతుంది. దీని నివారణకు మొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి 3 గ్రాముల గంధకం కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో తెగులు కనిపిస్తే హెబ్బా కోనజోల్ 2 మి.లీటర్లు, లేదా ప్రాపికోనజోల్ 1 మి.లీటరు లేదా డినోకాఫ్ లేదా ట్రిడిమార్ఫ్ 1 మి. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ సూచనలు పాటించడం వల్ల మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు.

రెస్టారెంట్‌లో మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలో హైవేలో ఉన్న వైష్ణవి రెస్టారెంట్‌లో మద్యం అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకాలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా, కింగ్‌ఫిషర్ బీర్లు–4, బూమ్ బీర్లు–4, ఆఫీసర్ ఛాయిస్ ఒక ఫుల్‌బాటిల్ మద్యం లభించిందన్నారు. వీటిని అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకాలు సాగిస్తున్న కట్టా లక్ష్మణరావును అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

వర్షించని మేఘం

- ఈ ఏడాది వర్షాలు తక్కువే..!
- నియోజకవర్గంలో మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- వర్షపాతం లోటు 120 మిల్లీమీటర్లు

తణుకు: ఆకాశం మేఘావృతం అవుతోంది... ఉరుములు, మెరుపులతో వాతావరణం హడావుడి చేస్తోంది... అయితేనేం వర్షాలు మాత్రం ఆశించిన స్థాయిలో కురవడంలేదు. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ప్రారంభమైన తర్వాత తణుకు నియోజకవర్గంలో ఇప్పటి వరకు తగినంత వర్షాలు కురవలేదనే చెప్పాలి. జూన్ నెల నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 630 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... నియోజకవర్గంలో కేవలం 440.7 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. గత ఏడాదితో పోల్చితే ఇది తక్కువ. గతేడాది సెప్టెంబరు మొదటి వారానికి నియోజకవర్గంలో 580 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 4 శాతం అధికం. ఈ ఏడాది మాత్రం సాధారణ స్థాయి కంటే 120 మిల్లీ మీటర్ల తక్కువగా వర్షాలు కురిశాయి. ఆగస్టు నెలలో సైతం అటు జిల్లాలో ఇటు నియోజకవర్గంలో సైతం రికార్డు స్థాయి వర్షపాతం నమోదు కాలేదు. వాతావరణ శాఖ లెక్కలు ప్రకారం సాధారణ స్థాయికి 20 శాతం అధికం లేదా తక్కువ ఉన్నా సాధారణంగా పరిగణిస్తారు. నైరుతి ఆరంభం నుంచే భారీ వర్షాలు కురవనప్పటికీ అక్కడక్కడా చెదురు మదురు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో సైతం సాధారణ వర్షపాతం నమోదైంది. ఫలితంగా వ్యవసాయం ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతోంది.

విచిత్ర వాతావరణం...

ఈ ఏడాది విచిత్ర వాతావరణం నెలకొంది. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో గడిచిన మూడు నెలల్లో వర్షాలు తక్కువగానే కురిశాయి. జూన్‌లో 23 శాతం, జులైలో 15 శాతం తక్కువగా వర్షపాతం నమోదు కాగా ఆగస్టులో మాత్రం ఏకంగా 50 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన మూడు నెలల కాలంలో ఇరగవరం మండలంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. అయితే ఇక్కడ కూడా ఆగస్టులో 80 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం విశేషం. తణుకు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో వాయుకాలుష్యం కారణంగా వర్షపాతం తక్కువ నమోదు అవుతుంటుందని చెబుతుంటాయి. ఈ పరిస్థితుల్లో తణుకు పట్టణంతో పాటు మండలంలో వర్షపాతం తక్కువ నమోదు అవుతుంటుంది. మరోవైపు గత నెల ఆగస్టులో మూడు మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురవలేదు. ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.


తణుకులో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

పట్టెంపాలెంలో వరి మాసూళ్లు ప్రారంభం


పట్టెంపాలెం గ్రామంలో కోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కిస్తున్న రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పట్టెంపాలెంలో ఖరీఫ్ వరి మాసూళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వరి కోతలను ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్. ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం 120 రోజుల కాలపరిమితి కలిగిన పీఆర్–126 రకం కోతలు జరుగుతున్నాయని, ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు కట్టుపొట్టు వస్తుందన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

దుర్గమ్మ ట్రస్టు బోర్డు సభ్యుడిగా వెంకట్రాజు


మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకొంటున్న కోసూరి వెంకట్రాజు

పెంటపాడు: విజయవాడ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ట్రస్టు సభ్యునిగా కోసూరి వెంకట్రాజు అమ్మవారికి ఇతోధిక సేవలు అందించాలని ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. విప్పర్రుకు చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు కోసూరి వెంకట్రాజు సోమవారం విజయవాడ ఇంద్రకీలాద్రిలో అమ్మవారి ట్రస్టు సభ్యునిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అక్కడే అమ్మవారి సన్నిధిలో ఉన్న మంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసారు. తనకు ఈ పదవి ఇచ్చి గౌరవించిన దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చిలకంపాడులో ఎల్ఎల్ఎం నూతన మందిర ప్రతిష్ఠ

పెంటపాడు: గూడెం ఎల్ఎల్ఎం విమోచన మందిరం ఆధ్వర్యంలో చిలకంపాడులో నెల 12న నూతన మందిర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పాస్టర్ విజయ్‌కుమార్, సిస్టర్ మేరీలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎల్ఎం సంస్థ వ్యవస్థాపకులు, యునైటెడ్ పాస్టర్ల సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, సిస్టర్ యోరీ జైలు పాల్గొని నూతన మందిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించబోయే ప్రతిష్ఠ ఆరాధనలో విశ్వాసులు పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి నాదేశం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట ప్రాంతంలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గుడాల ఈశ్వర్ ఈశ్వర్ అన్నారు. ప్రతి గ్రామం నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి మండల కేంద్రాల నుంచి ఢిల్లీకి పంపించేందుకు రాష్ట్ర, జిల్లా పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొల్లి నరసింహమూర్తి, రావూరి సుధ, పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, సెక్రటరీ కొల్లి కొండప్రసాద్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

సాక్షి, భీమవరం: స్థానిక గునుపూడి నాచువారి సెంటర్‌లో వీరబాలాజీ కిరణా అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.మూడు వేల నగదు, రూ.2,500 విలువైన సిగరెట్లు చోరీకి గురైనట్టు యజమాని మురికిపూడి బాలాజీ తెలిపారు. ఆదివారం రాత్రి షాపు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు బాలాజీ పేర్కొన్నారు. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాత నాగేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన పరిమి నాగేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

దేవుని ఆధ్యాత్మికతను విశ్వాసులకు బోధించాలి

పెంటపాడు: విశ్వాసులకు దేవుని ఆధ్యాత్మిక మార్గాన్ని సులువుగా భోదించేలా దైవసేవకులు కృషి చేయాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపీఎఫ్) సంస్థ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. పెంటపాడు కొబ్బరితోటలోని హెర్మోన్ ప్రార్థనా మందిరంలో సోమవారం యుపీఎఫ్ సంఘ కార్యవర్గ సమావేశం సంఘ ఉపాధ్యక్షుడు సీహెచ్ మనష్షే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న సంస్థ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, బిషప్ ఐజక్ ముగ్గళ్ల తదితరులు బోధకులకు దేవుని వాక్యం భోదించారు. యేసు ప్రభువు శిష్యులలోని తోమా భారతదేశానికి వచ్చి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి హతసాక్షిగా దేవుని సేవ చేశారన్నారు. ఆయనలోని గుణాలను సేవకులు పుణికిపుచ్చుకొని మాదిరిగా జీవనం సాగించాలన్నారు. సంస్థ అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు అందించారు. సంఘ కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్. అబ్రహం, కోశాధికారి డేవిడ్ లివింగ్‌స్టన్, శామ్యూల్ సునీల్, రత్నరాజు, రాజ్‌కుమార్, కరుణాకర్, ఇమ్మానియేలు, జాన్‌బాబు, జోసఫ్‌లతో పాటు, పలు మండలాలకు చెందిన యుపీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


పెంటపాడు యుపీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న దైవసేవకులు

ఆరుగొలను సొసైటీ మహాజన సభ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో సోమవారం మహాజన సభ జరిగింది. ఈ సభకు సొసైటీ అధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2023 మార్చి 13 నుంచి 2023 సెప్టెంబరు 10వ తేది వరకు జమా ఖర్చులు, కొత్త సభ్యుల ఆమోదం, 2022–23 సంవత్సరానికి ఆడిట్ రిపోర్టుపై చర్చ – ఆమోదం, నూతనంగా నిర్మించనున్న భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్, రెండవ అంతస్తులో మినీ కల్యాణ మండపం నిర్మాణంపై సభ్యులు చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ బాదం సూర్యచంద్రరావు, యాతం సత్యనారాయణ, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, కొత్తూరు మాజీ ఎమ్పీటీసీ కూడవల్లి నరసింహమూర్తి, తిరుమల సూర్యనారాయణ, ఆరుగొలను, కొత్తూరు, దండగర్ర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను సొసైటీ మహాజన సభ నిర్వహిస్తున్న దృశ్యం

బాధ్యతల స్వీకరణ


అత్తిలి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఆమీలుజమను అభినందిస్తున్న దృశ్యం

అత్తిలి: అత్తిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎండీ ఆమీలుజమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అత్తిలి ఎంపీడీవోగా విధులలో చేరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఏఓ రామారావు, ఈవోఆర్డీ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు.

ముగిసిన కృష్ణమందిర 66వ వార్షికోత్సవాలు


పేద విద్యార్థులకు నగదు అందిస్తున్న పెదకృష్ణం రాజు

పెంటపాడు: అలంపురం గ్రామంలో కృష్ణజయంతి 66 వ మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పురస్కరించుకొని సోమవారం గ్రామంలో మురళీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 3 వేల మంది అన్నసమారాదనలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. మురళీకృష్ణ యువజనసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వెంకటరమణ సేవా చారిటీ ఆసుపత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు బహుమతులు అందించారు. మరో 10 మంది పేద విద్యార్థులకు నగదు సాయం చేశారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలోని 2వ సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి తెలిపారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, సుగర్ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనంతరం బీపీ, సుగర్ బాధితులకు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు అవసరమైన మందులను మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ప్రసాద్, వైటీ మూర్తి, కాపా సుధ, విక్టోరియా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

సాక్షి, భీమవరం / ఆకివీడు: జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్, 144 సెకండ్ సీఆర్‌పీసీ అమలులో ఉందని ఎస్పీ యు.రవిప్రకాష్ సోమవారం తెలిపారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు రిమాండ్ నేపథ్యంలో నిరసనలు, ధర్నాలు, బంద్‌కు అనుమతి లేదన్నారు. బంద్ పేరుతో విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలను బలవంతంగా మూయించినా, నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పైకొచ్చి అల్లర్లు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. టీడీపీ, జనసేన నాయకులు బంద్‌కు పిలుపునివ్వగా ఆకివీడు రైల్వే స్టేషన్ ప్రాంతం, బస్ స్టాండ్, ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఉండి నియోజకవర్గంలో ఏవిధమైన అవాంఛనీయ ఘటనలూ జరగలేదని ఎస్పీ చెప్పారు. డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగబాబు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద, ప్రధాన సెంటర్లలో పోలీస్ పికెట్‌లు నిర్వహించారు.

బంద్ విఫలం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సోమవారం టీడీపీ నాయకులు బంద్‌కు పిలుపునిచ్చినా దుకాణాలు, షాపులు, ప్రభుత్వ పాఠశాలలు యధావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్‌లు తిరిగాయి. మండలంలో టీడీపీ నాయకులు కొన్ని చోట్ల పలు దుకాణాలు మూయించారు. నాయకులు వెళ్లిన వెంటనే దుకాణాలను యజమానులు తెరిచి వ్యాపారాలు సాగించారు.

స్పందన కరువు

ఉండి: టీడీపీ, జనసేన పార్టీలు చేపట్టిన బంద్‌కు ఉండిలో స్పందన కరువైంది. సోమవారం ఉదయం టీడీపీ నాయకుల కోరికమేరకు కొద్దిసేపు దుకాణాలు మూసివేశారు. టీడీపీ నాయకులు కొంతసేపు అటూ ఇటూ తిరిగి వారుకూడా ఇళ్లకు వెళ్లిపోయారు. 11:30 గంటల సమయంలో యధావిధిగా దుకాణాలు తెరిచేశారు. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. బంద్‌లో జనసేన నాయకులెవ్వరూ పాల్గొలేదు.


ఆకివీడు రైల్వే స్టేషన్‌లో బంద్ ప్రభావంపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

గ్లోబల్ ఇంజినీర్స్‌గా మారాలి

సాక్షి, భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు గ్లోబల్ ఇంజినీర్స్‌గా తయారైనప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని కాకినాడ జేఎన్‌టీయూ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువు విజ్ఞానం పెంపొందించుకోవడమే లక్ష్యంగా సాగాలన్నారు. సెల్ ఫోన్స్ వంటి ఇతర మాధ్యమాలను విజ్ఞాన సముపార్జనకు ఉపయోగించాలే తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటే విద్యార్థి జీవితం అంధకారమవుతుందని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయ తత్వం వంటి అవలక్షణాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఎన్నో వసతులు ఉన్నాయని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణను కళాశాల తరపున సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజనలో భాగంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సలహాలు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్ అమలేశ్వరరావు, కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో సాగు బాగు

- రసాయన ఎరువుల వినియోగం అధిక నష్టం
- రైతులకు పెరుగుతున్న ఖర్చులకు కళ్లెం

పెంటపాడు: రైతులు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడి సాగు ఖర్చులను ఆదా చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత తరుణంలో రైతులు రసాయనిక ఎరువులు ఉపయోగించడం వల్ల పంట నష్టం తీవ్రంగా జరుగుతోంది. మెట్ట, డెల్టాలతో పోల్చితే ప్రధానంగా సేంద్రియ సాగు మెట్ట ప్రాంతంలో ప్రారంభమైంది. కాగా డెల్టాలో కూడా పెరుగుతున్న సాగు ఖర్చులను ఆదా చేసుకొనేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం వల్ల రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. పైగా పంటకు నాణ్యత ఉండటం లేదని అంతర్జాతీయ మార్కెట్లో చెబుతున్నారు. గత రెండేళ్ల నుండి సేంద్రియసాగుపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు వ్యవసాయాధికారులు, ప్రకృతి సేద్య నిపుణులు రైతులకు సూచనలు చేస్తున్నారు. దీంతో శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే సేంద్రియ సాగుతో వ్యయం తగ్గి లాభాలు చేకూరుతాయి. సేంద్రియం అంటే ప్రధానంగా రైతులకు పూర్తి అవగాహన ఉండాలి. సేంద్రియం అంటే పశువుల ఎరువు, వానపాముల ఎరువు, గొర్రెలు, కోళ్ల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, ప్రధానమైనవి. వీటి వాడకం వల్ల భూమి తన సహజస్థితిని పొందడమే కాక, పంటకు ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. అంతే కాక నాణ్యమైన విషరహితమైన పంటలు పండించవచ్చు. వీటితో పాటు, మెట్ట ప్రాంతాల మాదిరిగా మూడో పంటగదా అపరాలు కూడా సాగు చేయవచ్చు. దీంతో మొక్కలకు పోషక పదార్థాలు ఎక్కువగా లభిస్తాయి. పచ్చిరొట్ట ఎరువులు సమగ్రపోషక యాజమాన్యంలో ప్రధానమైనవి. పచ్చిరొట్టతో వివిధ పంటల్లో దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. వాటిలో జీలుగు, జనుము, మినుము, పిల్లి పెసర, అలసంద తదితర పంటలు ముఖ్యమైనవి. జీవన ఎరువులు పంటల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు అందించే సూక్ష్మ జీవకణాల సముదాయాలను జీవన ఎరువులు అంటారు. వీటిలో నత్రజనిని స్థిరీకరించేవి. రైజోబియ్యం, నీలి, ఆకుపచ్చఆకు, అజిటో, బ్యాక్టీరియా, అజో స్పైరిల్లం, అజోల్లో ఒక రకం కాగా జీవన ఎరువు భాస్వరంను భూమిలో లభ్యమయ్యేలా చేసే ఫాస్ఫో బ్యాక్టీరియా రెండోది. ఇవి మార్కెట్లో వివిధ పరిమాణాల్లో లభిస్తాయి.


మండలంలో కాలిబాటలు వేసిన వరి చేను

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పచ్చిరొట్ట ఎకరాకు 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ను వేసి పలుచగా నీరు పెట్టి 100 నుంచి 150 కిలోల అజోల్లా వేసి రెండు మూడు వారాల్లో కలియదున్నాలి. దీంతో ఎకరాకు మూడు టన్నుల పచ్చిరొట్టతో 12 కిలోల నత్రజని అందుతుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. పంట కూడా నాణ్యత ఉంటుంది

– కె. పార్థసారధి ఏవో పెంటపాడు మండలం

అధికారుల సూచనలు పాటించాలి



కల్చర్‌పై రైతులు పూర్తి అవగాహన పొందాల్సి ఉంది. కాగా ఇప్పుడిప్పుడే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆర్‌బీకేల ద్వారా రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒక కిలో కల్చర్‌ను 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలలో వేయాలి. ఇక రైతులు రసాయనిక ఎరువులు సిఫార్సుచేసిన మోతాదులోనే వాడాలని అధిక మోతాదులో వాడితే పురుగులు తెగుళ్లు తీవ్రంగా వ్యాప్తిస్తాయి.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జట్లపాలెం

వాహనం ఢీకొని ఆవు మృతి

ఆకివీడు: స్థానిక కార్పొరేషన్ బ్యాంక్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆదివారం రాత్రి ఆవు మృతి చెందింది. ఆవుకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ముందుకు రాకపోవడంతో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు జేసీబీలోకి ఎక్కించి, స్మశాన వాటికలో ఆవును పూడ్చిపెట్టారు. హైవేపై ఆవుల్ని వదిలివేయడంతో వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి ఢీకొడుతున్నాయి. పలు పశువులు ఈ విధంగా గాయపడి, మరణించిన ఘటనలున్నాయి. ఇటీవల గుమ్ములూరు సెంటర్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆవు చనిపోయింది. దీనిపై భీమవరం జడ్జి స్పందించి సుమోటోగా కేసు నమోదు చేయించారు. ఆవుల్ని, ఆబోతుల్ని రోడ్లపైకి రానివ్వకుండా నగర పంచాయతీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

13న ఫిట్టర్స్‌కు జాబ్‌మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడులో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఏజీఐ గ్రీన్‌ప్యాక్, ఏజీఐ గ్లాస్ ప్యాక్ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఫిట్టర్ ఉత్తీర్ణులైన వారు తమ ఒరిజినల్ సరిఫికెట్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.